
తెలంగాణ ప్రజావారధి
ప్రతి అడుగు నిజం వైపు
www.telanganaprajavaradhi.com
తెలుగు దినపత్రిక







y) towards the following infrastructure & Developmental works in Mothkur Municipality:-

| .No | Name of the work | Estimated cost (Rs.in Crs) |
|---|---|---|
| 1. | Laying of BT roads various wards in Mothkur Municipality | 5.00 |
| 2. | Laying of CC Roads various wards in Mothkur Municipality | 5.00 |
| 3. | Construction of Dr. BR Ambedkar, Bapujagjeevan Ram Study Circles in Mothkur Municipality | 2.50 |
| 4. | Construction of Compound walls at Govt. jr. College, Library and Dumping yard in Mothkur Municipality | 1.00 |
| 5. | Development of junctions, Parks & Beautification in Mothkur Municipality | 1.50 |
| | Total | 15.00 |

2. The amount sanctioned in para (1) above, shall be met from the ...

# మోత్కూరు మున్సిపాలిటీలో..

# రూ.15 కోట్ల పంచాది

## టెండర్ అయిన పనుల రద్దుకు మున్సిపల్ కౌన్సిల్ ఆమోదం

- మాకు తెల్వకుండా పెట్టిన పనులను ఎలా ఆమోదిస్తామన్న కౌన్సిలర్లు
- మున్సిపల్ ఎన్నికలకు ముందు రూ.15 కోట్ల పనులకు సింగిల్ టెండర్
- టెండర్ వేసిన ఎమ్మెల్యే సామేల్‌కు అత్యంత సన్నిహితుడైన కాంట్రాక్టర్
- పనుల రద్దు తీర్మానంపై సంతకాలు చేసిన మెజార్టీ 8 మంది కౌన్సిలర్లు
- సంతకాలు చేయని చైర్మన్, వైస్ చైర్మన్, మరో ఇద్దరు కౌన్సిలర్లు

**ప్రజావారధి/మోత్కూరు**

మోత్కూరు మున్సిపాలిటీలో రూ.15 కోట్ల నిధులపై పంచాది నెలకొంది. పనుల ఆమోదానికి మున్సిపల్ కౌన్సిల్‌లో పెట్టిన తీర్మానంపై కౌన్సిలర్ల మధ్య భేదాభిప్రాయాలు రావడంతో పాటు అధికార కాంగ్రెస్ కౌన్సిలర్లు రెండు వర్గాలుగా విడిపోయారు. దీంతో మాకు తెల్వకుండా పెట్టిన పనులకు ఆమోదం తెలిపేది లేదంటూ అధికార కాంగ్రెస్ ఐదుగురు కౌన్సిలర్లతో పాటు మరో ముగ్గురు బీఆర్ఎస్ కౌన్సిలర్లు మెజార్టీ 8 మంది సభ్యులు తీర్మానానికి వ్యతిరేకంగా చేతులు లేపి సంతకాలు చేశారు. తీర్మానం సంతకాలు పెట్టకుండా మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ సహా మరో ఇద్దరు కౌన్సిలర్లు సమావేశం నుంచి బయటకు వచ్చారు. వివరాల్లోకి వెళితే..

మోత్కూరు మున్సిపల్ బడ్జెట్ ఆమోదం కోసం సోమవారం మున్సిపల్ చైర్మన్ గడ్డం స్వప్నసోమనర్సయ్య అధ్యక్షతన కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. సమావేశంలో బడ్జెట్‌తో పాటు ఇతర అంశాలపై మున్సిపల్ అధికారులు ఎజెండా తయారు చేసి పలు తీర్మానాల ఆమోదం కోసం పెట్టారు. అందులో రాష్ట్ర ప్రభుత్వం మున్సిపల్ ఎన్నికలకు ముందు అన్ని మున్సిపాలిటీలకు నిధులు మంజూరు చేయగా అందులో మోత్కూరు మున్సిపాలిటీకి రూ.15 కోట్ల నిధులు మంజూరయ్యాయి. ఎన్నికలకు ముందు తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ ఆ నిధులతో చేపట్టే పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన కూడా చేశారు. ఆ రూ.15 కోట్ల నిధులతో చేపట్టే పనులకు ఎన్నికలకు ముందే టెండర్ పూర్తయ్యింది. ఆ పనులను తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్‌కు చెందిన అత్యంత సన్నిహితుడైన కాంట్రాక్టర్ వినోద్ రెడ్డి (నాగార్జున కన్‌స్ట్రక్షన్స్) ఒక్కరే సింగిల్ టెండర్ వేసి దక్కించుకున్నారు. ఆ పనుల ఆమోదం కోసం కౌన్సిల్‌లో తీర్మానం పెట్టారు. కొత్తగా ఎన్నికైన అధికార కాంగ్రెస్ కౌన్సిలర్లతో పాటు ప్రతిపక్ష బీఆర్ఎస్ కౌన్సిలర్లు తమకు తెలియకుండా పెట్టిన పనులకు ఎలా ఆమోదం తెలుపుతామని, రూ.15 కోట్ల పనులకు సింగిల్ టెండర్ ఎలా వేస్తారని, ఇష్టం వచ్చినట్లు పనులు చేస్తే తమ వార్డుల్లో అభివృద్ధి చేయకుంటే ప్రజలకు ఏం సమాధానం చెప్పాలని ప్రశ్నించారు. ఆమోదం చాలని కొందరు, ఆమోదం తెలపమంటూ మరికొందరు పట్టుబట్టడం, అధికార కాంగ్రెస్ కౌన్సిలర్లే తీవ్రంగా వ్యతిరేకించడంతో సభ్యుల మధ్య వాగ్వివాదం నెలకొన్నట్టు తెలిసింది. దీంతో రెండు వర్గాలుగా విడిపోయిన కాంగ్రెస్ కౌన్సిలర్లు పనులను రద్దు చేసి కొత్తగా టెండర్లు పిలవాలని కొందరు..లేదు ఆ పనులకే ఆమోదం తెలపాలని మరికొందరు పట్టుబట్టి ఓటింగ్ పెట్టగా ఐదుగురు కాంగ్రెస్ కౌన్సిలర్లు కుర్మిళ్ల ప్రమీలరాములు, బీసు శ్రీకాంత్, కారుపోతుల వెంకన్న, మెంట రమణనగేష్, మొగుళ్ల అనురాధతో పాటు బీఆర్ఎస్ కౌన్సిలర్లు సుల్తాన్ స్వామి, కొండ శోభసోమల్లు, నల్ల మధు మెజార్టీ 8 మంది సభ్యులు చేతులెత్తి సంతకాలు చేయగా, చైర్మన్ స్వప్నసోమనర్సయ్య, వైస్ చైర్మన్ పల్లెర్ల వెంకన్న, కౌన్సిలర్లు పన్నాల శ్రీవిద్యశ్రీనివాస్ రెడ్డి, గనగాని శైలజనర్సింహ సంతకాలు చేయకుండా సమావేశం నుంచి బయటకు వెళ్లిపోయారు. ఆదిలోనే అధికార కాంగ్రెస్ కౌన్సిలర్ల మధ్య భేదాభిప్రాయాలు నెలకొనడంతో మున్ముందు ఎలాంటి పరిణామాలు చోటుచేసుకుంటాయన్న చర్చకు దారితీసింది. రూ.15 కోట్ల పనులను రద్దు చేస్తూ మున్సిపల్ కౌన్సిల్ తీర్మానం చేయడంతో తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ ఏ విధంగా స్పందిస్తారో చూడాలి.

ప్రజావారధి
ప్రతి అడుగు నిజం వైపు
www.telanganaprajavaradhi.com
తెలుగు దినపత్రిక
మంగళవారం
జనరల్ న్యూస్
31 - 03 - 2026


# మోత్కూరులో ఆంధ్రోడికి ఇందిరమ్మ ఇల్లు

## ఓ రాజకీయ నాయకుని పైరవీతో ఇల్లు మంజూరు

- మున్సిపాలిటీలో పేదలు లేరని ఆంధ్ర వ్యక్తికి ఇందిరమ్మ ఇల్లు
- రోడ్డు వెడల్పులో ఇండ్లుపోయిన వారికి మొండి చేయి
- అధికారులు, నాయకుల తీరుపై విమర్శలు

ప్రజావారధి/మోత్కూరు

తినేది మొగుని సొమ్ము..పాడేది వాడెవడి పాటో అన్న సామెతలా ఉంది మన అధికారులు, నాయకుల తీరు. తెలంగాణ పేద ప్రజల కోసం కాంగ్రెస్ ప్రభుత్వం పెట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకంలో మోత్కూరు మున్సిపాలిటీలో పేదలే లేరన్నట్టు..ఆంధ్రోడికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేశారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇందిరమ్మ ఇళ్ల పథకంలో భాగంగా తొలి విడత మోత్కూరు మున్సిపాలిటీకి 165 ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యాయి. అందులో పేదలైన సుమారు 27 మంది ఆర్థిక కారణాలు, స్థలం సమస్యలతో పాటు రకరకాల కారణాలతో ఇండ్లు కట్టుకోలేకపోయారు. దీంతో వారి స్థానంలో అర్హులైన పేదలను ఎంపిక చేయాల్సి ఉండగా ఆ జాబితాలో ఓ రాజకీయ నాయకుని పైరవీతో ఆంధ్రోడికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేశారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. మున్సిపాలిటీలోని 12వ వార్డులో ఆ ఆంధ్ర వ్యక్తికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేసినట్టు తెలిసింది. త్వరలోనే ఆ జాబితాలో ఉన్నవారికి మంజూరు పత్రాలు ఇచ్చే అవకాశముందంటున్నారు. స్థానికులను, ఊర్లోళ్లను కాకుండా పేదలే లేరన్నట్టు ఆంధ్ర వ్యక్తికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయడంతో ప్రజలు తిట్టిపోస్తున్నారు. ఆంధ్ర వ్యక్తికి ఇల్లు మంజూరు చేసిన విషయం మున్సిపల్ పాలకవర్గం గాని, కాంగ్రెస్ నాయకుల ద-ష్టికి వచ్చి జరిగిందా లేక చాటుమాటుగా ఎంపిక చేశారా అన్నది తెలియాల్సి ఉంది. మున్సిపాలిటీలో మెయిన్ రోడ్డు వెడల్పులో సుమారు 19 మంది ఇండ్లను కోల్పోగా వారికి ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తామని వారికి హామీ ఇవ్వగా వారిని కాకుండా, మోత్కూరు పట్టణంతో పాటు మున్సిపాలిటీ పరిధిలోని జామచెట్లబావి, కొండాపురం, కొండగడప, బుజిలాపురం, ఆరెగూడెం, రాజన్నగూడెం గ్రామాల్లో అర్హులైన పేదలే అధికారులకు, నాయకులకు కనిపించలేదా అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికే ఇక్కడే పుట్టి పెరిగిన అర్హులైన పేదలకు కాకుండా మార్వాడీలకు, ఇతర రాష్ట్రాల నుంచి బతకొచ్చిన వారికి పింఛన్లు కూడా మంజూరు చేశారని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఆ ఆరోపణలపై ప్రజలకు సమాధానం ఇవ్వాల్సిన బాధ్యత అధికారులపైనే ఉందంటున్నారు. ఆంధ్ర వ్యక్తికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేసిన విషయంపై మున్సిపల్ కమిషనర్ కె.సతీష్ కుమార్‌ను వివరణ కోరగా 30 మందితో జాబితా పంపగా 27 మందికి ఇండ్లు మంజూరు చేస్తూ లిస్ట్ వచ్చిందని, స్థానికంగా అతను ఎన్నేళ్లుగా ఉంటున్నాడు.. ఆధార్‌కార్డు, స్థలం ఉంటే పరిగణలోకి తీసుకుంటారని, ఆంధ్ర వ్యక్తిని ఏ విధంగా ఎంపిక చేశారన్న విషయాలను పరిశీలిస్తామన్నారు.

# మోత్కూరు మున్సిపల్ బడ్జెట్ రూ.44.62 కోట్లు




- మీడియాకు బడ్జెట్ పూర్తి వివరాలు ఇవ్వని మున్సిపల్ అధికారులు
- ఎక్కడి నుంచి నిధులు, ఆదాయం వస్తుంది..పోతుందన్న వివరాలే లేవు
- గతంలో పూర్తి డేటాతో ఇచ్చిన అధికారులు
- వివిధ అంశాలపై మున్సిపల్ కౌన్సిల్ తీర్మానం

ప్రజావారధి/మోత్కూరు

మోత్కూర్ మున్సిపల్ బడ్జెట్ రూ.44.62 కోట్లకు ప్రవేశపెట్టగా కౌన్సిల్ ఆమోదించింది. మున్సిపల్ చైర్పర్సన్ గడ్డం స్వప్న సోమ నరసయ్య అధ్యక్షతన సోమవారం మున్సిపల్ కౌన్సిల్ సమావేశం నిర్వహించగా 2026-27 ఆర్థిక సంవత్సరానికి గాను మున్సిపల్ అధికారులు రూ. 44 కోట్ల 62 లక్షల 30 వేలకు బడ్జెట్ ప్రవేశపెట్టగా పాలకవర్గ సభ్యులు తీర్మానాన్ని ఆమోదించారు. అందులో రూ.44 కోట్ల 60 లక్షల 96 వేల రూపాయలు ఆదాయంగా అంచనా వేయగా, అందులో రూ.44 కోట్ల 60 లక్షల 96 వేల రూపాయలను వ్యయంగా, రూ.లక్షా 34 వేల రూపాయలు మిగులు బడ్జెట్ గా అంచనా వేశారు. రూ.44 కోట్ల 62 లక్షల బడ్జెట్‌కు సంబంధించి మున్సిపాలిటీకి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి వస్తున్న నిధులు, మున్సిపాలిటీ పన్నులు, ఉద్యోగులు, సిబ్బంది వేతనాలతో ఇతరత్రా ఆదాయ మార్గాలు, వేటికి ఎంత ఖర్చు చేస్తున్నారన్న పూర్తి బడ్జెట్ వివరాలను గతంలో మీడియాకు ఇవ్వగా ప్రస్తుత బడ్జెట్ వివరాలను మున్సిపల్ అధికారులకు మీడియాకు ఇవ్వలేదు. బడ్జెట్‌కు సంబంధించిన పూర్తి అంశాలు మున్సిపాలిటీ ప్రజలకు తెలియాల్సి ఉండగా అదేదో రహస్యంలా అధికారులు ఏకవ్యాఖ్యం, ఒకే పేరాతో బడ్జెట్ పెట్టి ప్రెస్‌నోట్ రిలీజ్ చేసి చేతులు దులుపుకున్నారు. బడ్జెట్‌కు సంబంధించి పూర్తి డేటాను కొత్త పాలకవర్గం సభ్యులకైనా ఇచ్చారో లేదో తెలియదు. కాగా కౌన్సిల్ సమావేశం సుదీర్ఘంగా సుమారు 5 గంటల పాటు నిర్వహించి సభ్యులు వీధి కుక్కలు, కోతుల నుండి ప్రజల సంరక్షణ, వేసవిలో తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు చేపట్టాలని, గతంలో అసంపూర్తిగా ఉన్న అభివృద్ధి పనులను పూర్తి చేసేందుకు కావాల్సిన నిధులను రాష్ట్ర ప్రభుత్వం నుండి తీసుకరావాలని, పబ్లిక్ ప్రదేశాల్లో మోడ్రన్ టాయిలెట్స్ ఏర్పాటు, తై బజార్ వేలం, అంబేద్కర్ చౌరస్తా సమీపంలోని హెచ్ డిఎఫ్ సి బ్యాంక్ వద్ద బస్ స్టాప్, పట్టణంలో వరద కాల్వకు ఇరువైపులా ఫెన్సింగ్, కాల్వ క్లీనింగ్, ఔట్ సోర్సింగ్ పద్దతిలో 20 మంది సిబ్బంది నియమకంతో పాటు సుమారు 45 అంశాలపై ఆమోదం తెలిపినట్లు మున్సిపల్ కమీషనర్ కె.సతీష్ కుమార్ వెల్లడించారు. ఈ సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మెన్ పల్లెర్ల వెంకన్న, కౌన్సిలర్లు కురిమిళ్ల ప్రమీలరాములు, సుల్తాన్ స్వామి, కొండ శోభసోంమల్లు, మొగుళ్ల అనురాధశ్రీనివాస్ రెడ్డి, గనగాని శైలజనర్సింహ, పన్నాల శ్రీవిద్యశ్రీనివాస్ రెడ్డి, బీసు శ్రీకాంత్, నల్ల మధు, కారుపోతుల వెంకన్న , మెంట రమణనగేష్, మున్సిపల్ మేనేజర్ ప్రభాకర్, అకౌంటెంట్ మత్స్యగిరి తదితరులు పాల్గొన్నారు.